## డాక్టర్ శిరీషకు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న శిరీష

గాంధీఆస్పత్రి: వైద్యవిద్యలో **అత్యుత్తమ ప్రతిభ** కనబర్చిన జనరల్ సర్జరీ విభాగ జూనియర్ వైద్యురాలు డాక్టర్ శిరీషామేరీకి గోల్డ్‌మెడల్ అందజేశారు. గాంధీ ఆస్పత్రి జనరల్ సర్జరీ విభాగంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో దివంగత జూనియర్ డాక్టర్ పూర్ణచందర్‌గుప్తా జ్ఞాపకార్థం గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి డాక్టర్ శిరీషమేరీకి బంగారు పతకం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్ కుమార్, జనరల్ సర్జరీ హెచ్‌ఓడీ రాజారామ్, వైస్ ప్రిన్సిపాల్ రవిశేఖర్ పాల్గొన్నారు.

## మోదీ సమయస్ఫూర్తితోనే ఉగ్ర స్థావరాలు ధ్వంసం



తిరంగా ర్యాలీలో పాల్గొన్న మర్రి శశిధర్‌రెడ్డి, భరత్‌గౌడ్

రాంగోపాల్‌పేట్: పహల్గాం దాడి లాంటి క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ సమయస్ఫూర్తితోనే ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశారని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కన్వీనర్ మేకల సారంగపాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'లో వారు పాల్గొని మాట్లాడారు. మన దళాలు కేవలం 25 నిమిషాల్లో పాకిస్తాన్‌లోని ఉగ్ర మూకల్ని మట్టుబెట్టాయన్నారు. అనంతరం జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు చీర సుచిత్ర, కొంతం దీపిక, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా, బీజేవైఎం సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు శివాజీ, అధికార ప్రతినిధులు బీఎస్ శ్రీనివాస్, నాయకులు శ్రీశైలంగౌడ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఏపీ 28 రిజిస్ట్రేషన్ ఆటోల స్థానంలో కొత్తవి ఇవ్వాలి



బెజ్జాల కృష్ణమూర్తి

లాలాపేట: రిజిస్ట్రేషన్ వ్యాలిడిటీ ముగిసిన (ఏపీ 28) కల్గిన ఆటోలను స్క్రాప్‌గా తీసుకుని వాటి స్థానంలో కొత్త ఆటోలను ఇవ్వాలని ఏఐటీయూసీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జాల కృష్ణమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో డా. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 'ఏపీ 28 యూ, వీ'కల్గిన దాదాపు 5200 ఆటోలను సిటీ పర్మిట్‌లోనే గుర్తించారు. సిటీలో తిరిగే ఆటోలకు వర్తించే అన్ని రకాలైన సదుపాయాలను కల్పించారని గుర్తు చేశారు. ఇటీవల ప్రభుత్వం హైదరాబాద్ సిటీలో ఏపీ 9, 10, 11, 12, 13 రిజిస్ట్రేషన్ వ్యాలిడిటీ ముగిసిన వాటిని స్క్రాప్ కటింగ్ కింద తీసుకుని కొత్త ఆటోలను ఇస్తున్నారని తెలపారు. అదే మాదిరిగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలకు చెందిన గడువు ముగిసిన ఏపీ 28 రిజిస్ట్రేషన్ ఆటోలను సైతం స్క్రాప్ కటింగ్ కింద తీసుకుని ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## పెళ్లి చేయిస్తామని వృద్ధుడి నుంచి రూ.1.77లక్షలు వసూలు

- మోసం చేసిన ఇద్దరు మహిళల అరెస్టు

రాంగోపాల్‌పేట్: పెళ్లి పేరుతో వృద్ధుడిని మోసం చేసి డబ్బులు కాజేసిన ఇద్దరు మహిళలను మహంకాళి పోలీసులు రాత్రి అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా మధిర జామాపురానికి చెందిన ఇరుకుమాటి చినకొండయ్య (80) డీహెచ్‌ఎంఎస్ వైద్యుడు. చినకొండయ్యకు వివాహం జరిపిస్తామని, తన వయసుకు సరిపడే మహిళ ఉందని తమ మ్యారేజ్ బ్యూరో ద్వారా పలువురు వృద్ధులకు పెళ్లిళ్లు చేశామని నమ్మబలికారు. ఈ మహిళల మాటలు నమ్మిన చినకొండయ్య తనకు వధువును చూడమని కోరాడు. ఇందుకు ఫీజు రూపంలో చినకొండయ్య నుంచి రూ. 1.77 లక్షలు వసూలు చేశారు. ఆ తర్వాత సదరు మహిళల మాట మార్చడంతో చినకొండయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన కటారు తాయారమ్మ అలియాస్ సరస్వతి (60), మల్కాజిగిరి సత్యనాగేంద్రకాలనీకి చెందిన కూనపరెడ్డి స్వాతి (40)గా గుర్తించారు. కృష్ణా, కొత్తగూడెం జిల్లాలకు చెందిన ఈ ఇరువురు మహిళలు వృద్ధులను టార్గెట్ చేసుకుని మ్యారేజ్ బ్యూరో పేరుతో అందినకాడికి దండుకుని మోసానికి పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

# నో సేఫ్టీ..!

- **జోనల్ కార్యాల**యంలో ఫైర్‌సేఫ్టీ నిల్
- **ఇప్పటికీ ఐదు** అగ్ని ప్రమాదాలు
- **అయినా కానరాని** అప్రమత్తత
- **తుప్పుపట్టిపోయి**న ఫైర్ కంట్రోల్ యూనిట్
- **ఇదీ సికింద్రాబాద్** జీహెచ్‌ఎంసీ భవనంలో పరిస్థితి

**సికింద్రాబాద్: భారీ అంతస్తుల భవనాల నిర్మాణాలు, వాటి నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతుం**టారు. ముఖ్యంగా ఓ మోస్తరు భవన నిర్మాణదారులు సీసీ కెమెరాలు, ఫైర్‌సేఫ్టీ కిట్‌లు ఏర్పాటు చేసుకోవాలని సిటీ పోలీసులతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులు గైడ్ చేస్తుంటారు. అటువంటి పద్ధతులు పాటించడంలో మాత్రం జీహెచ్‌ఎంసీ అధికారులు విఫలం అవుతున్నారు. సికింద్రాబాద్‌లోని నార్త్ జోన్ జీహెచ్‌ఎంసీ కార్యాలయ భవనంలో అగ్నిప్రమాదం జరిగితే అందులోని వస్తువులు, రికార్డులు బుగ్గి కావాల్సిందే. ఇక్కడ అగ్నిప్రమాదం సంభవిస్తే నివారించడానికి ఎటువంటి ముందస్తు చర్యలు అందుబాటులో లేవు. ఎప్పుడో బిగించిన ఫైర్‌సేఫ్టీ కిట్ మొత్తంగా పనికిరాకుండా పోయింది. అయినప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇదే భవనంలో ఇప్పటికీ ఐదు మార్లు అగ్ని ప్రమాదాలు జరిగినా ఎటువంటి ముందస్తు చర్యలు అమలులోకి తేలేకపోవడం విచారకరం.

**ఐదు అంతస్తుల భవనం......**

◆ జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం కార్యాలయ నిర్వహణ కోసం సికింద్రాబాద్‌లో ఐదు అంతస్తుల భవనాన్ని ఇరవై ఏళ్ల క్రితం నిర్మించారు. మొదటి అంతస్తులో జోనల్ కమిషనర్ కార్యాలయం, మూడవ అంతస్తులో సికింద్రాబాద్, బేగంపేట్ సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. అర్బన్ కమ్యూనిటీ, టౌన్ ప్లానింగ్, పన్నులు, ఇంజినీరింగ్, శానిటరీ అండ్ హెల్త్ తదితర విభాగాల కార్యాయలయాలు ఈ భవనంలో కొనసాగుతున్నాయి. ఇవి కాకుండా స్పోర్ట్స్, ఎస్టేట్స్ కార్యాలయాలు కూడా ఇదే భవనంలో కొనసాగుతున్నాయి. సుమారుగా 600 మంది ఉద్యోగులు, 300 మంది వరకు సందర్శకులు ఈ భవనంలోకి నిత్యం వచ్చి వెళ్తుంటారు.

◆ జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయ భవనం నిర్మించిన ఐదేళ్లకు ఇందులో అగ్ని ప్రమాదాలు అరికట్టడం కోసం ఫైర్ సేఫ్టీ కంట్రోల్, కిట్‌ను ఏర్పాటు చేశారు. మంటలను అదుపు చేసేందుకు అన్ని అంతస్తులకు పైప్‌లైన్లు బిగించారు. బిగించిన ఏడాది కాలం నుంచే ఫైర్ సేఫ్టీ కిట్ నిర్వహణ వ్యవహారాలను గాలికి వదిలేశారు. దీంతో కార్యాలయం ఆవరణలో బిగించిన కంట్రోలింగ్ యూనిట్ మొత్తంగా తుప్పు పట్టిపోయింది. మంటలను ఆర్పేందుకు వినియోగించేందుకు ఫోమ్ వేసేందుకు వీలు లేకుండా భవనంలోని పైప్‌లైన్లు అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. క్రమేణా ఒక్కో అంతస్తులో బిగించిన సిలిండర్లు, వాల్వ్‌లు తుప్పుబట్టి పోయాయి.



కార్యాలయం ఆవరణలో తుప్పపట్టి పోయిన ఫైర్‌సేఫ్టీ కంట్రోల్ యూనిట్

◆ జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ కార్యాలయం నిర్మించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఇందులో ఐదుసార్లు అగ్నిప్రమాదాలు సంభవించాయి. ఎటువంటి ప్రాణనష్టం మాత్రం జరుగలేదు. ఐదుకు ఐదుసార్లు జరిగిన అగ్నిప్రమాదాలు కూడా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో మూడు ప్రమాదాలు నామమాత్రమైనవి కాగా మిగతా రెండు భారీ అగ్నిప్రమాదాలు కావడం గమనార్హం. గతేడాది జరిగిన ప్రమాదంలో ఒక ఫ్లోర్ మొత్తంగా మంటలు భారీగా వ్యాపించి బేగంపేట సర్కిల్ కార్యాలయంలో మొత్తంగా రికార్డులు బూడిదయ్యాయి. నాలుగు ఫైర్ ఇంజిన్లు పనిచేస్తేగానీ పరిస్థితి అదుపులోకి రాలేదు.



అలంకార ప్రాయంగా మిగిలిన జీహెచ్‌ఎంసీ భవనంలోని పైప్‌లైన్లు



సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ఉత్తర మండల కార్యాలయం

**అంతర్గత ఆధునీకరణకే పరిమితం....**

◆ ఈ కార్యాలయంలో అంతర్గత ఆధునీకరణ కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న అధికారులు ఫైర్‌సేఫ్టీ కిట్‌ను మాత్రం అందుబాటులోకి తేలేకపోతున్నారు. ప్రమాదాలు జరిగిన ప్రతీసారి ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటిస్తాం.. సేఫ్టీ కిట్‌ను మరమ్మతు చేపిస్తాం అంటూ చెప్పుకొస్తున్న అధికారులు ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు ఏమీ లేవనే చెప్పాలి. సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్ కార్యాలయాలు, వాటి అనుబంధ విభాగాల కార్యాలయాలను ఇప్పటికీ పలుమార్లు ఆధునీకరించారు. కార్పొరేట్ కార్యాలయాల తరహాలో ఫర్నీచర్, ఏసీలు, ఛాంబర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఒక్క ఫైర్ సేఫ్టీ విషయంలో మాత్రం అధికారులు చొరవ చూపించక పోతుండడం విచారకరం.

**త్వరలో మరమ్మతు చర్యలు చేపడుతాం....**

◆ నగరంలో పలు అగ్ని ప్రమాదాలు సంభవించిన తరుణంలో మాత్రమే సేఫ్టీ కిట్ గురించి చర్చిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ తరువాత చేతులు ఎత్తేస్తున్నారు. తాజాగా ఓల్డ్‌సిటీలో జరిగిన భారీ అగ్నిప్రమాదం నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అధికారులను సంప్రదించగా త్వరలో ఫైర్‌సేఫ్టీ కిట్‌కు త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెబుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలోనే ఫైర్‌సేఫ్టీ కిట్ ఏర్పాటుకు సంబంధించి నిధులు మంజూరయ్యాయని జోనల్ కార్యాలయ అధికారులు తెలిపారు. కొత్తగా విడులయ్యే బడ్జెట్‌లో ఫైర్‌సేఫ్టీ కోసం అన్ని విధాల చర్యలు తీసుకుంటామని వారు చెబుతుండడం గమనార్హం.

## తిరంగా ర్యాలీ..



పరేడ్ మైదానంలోని అమరవీరుల యుద్ధస్థూపం జాతీయ జెండాలతో బీజేపీ నాయకులు

రసూల్‌పురా: ఆపరేషన్ సిందూర్ విజయోత్సవంలో భాగంగా బీజేపీ కంటోన్మెంట్ నాయకులు సోమవారం తిరంగా ర్యాలీ చేపట్టారు. పరేడ్ మైదానంలోని అమరవీరుల యుద్ధ స్థూపం నుంచి ఆపరేషన్ సిందూర్ సైనికులకు మద్దతుగా జాతీయ జెండాలతో ఎంజీ రోడ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం దేశ రక్షణ కోసం మొదటి ప్రాధన్యాం ఇస్తుందన్నారు. మన దేశ సాయుధ దళాల సామర్థ్యం ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌గౌడ్, జిల్లా కార్యదర్శి మేకల సారంగపాణి, మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎన్ శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, కంటోన్మెంట్ బోర్డు వివిధ వార్డుల అధ్యక్షులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 38, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 32, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 28, దొండ 19, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## బంగారు పుస్తెలతాడు చోరీ

సనత్‌నగర్: స్నానం చేసి వచ్చేసరికి అల్మారాలోని 30 గ్రాముల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం .. సనత్‌నగర్ జింకలవాడ ప్రాంతంలో ఉంటూ స్టాఫ్ నర్సుగా పనిచేసే శనిగరపు సోనీ (27) ఈ నెల 17న తన 30 గ్రాముల బంగారు మంగళసూత్రం (పుస్తెలతాడు) అల్మారాలో ఉంచి స్నానానికి వెళ్లి వచ్చేసరికి పుస్తెల తాడు కనిపించలేదు. ఇంట్లో అంతటా వెతికినా దొరకలేదు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి మంగళసూత్రాన్ని ఎత్తుకెళ్లి ఉంటారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## బ్యాగులోని నగలు చోరీ

అమీర్‌పేట: దేవాలయానికి వచ్చిన భక్తురాలి బ్యాగులోని నగలు చోరీకి గురైన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ చిలకలగూడకు చెందిన అనంతాల సుధ బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తుంది.ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకునేందుకు వచ్చింది. ఆమె వద్దన్ను బంగారు ఆభరణాలు, క్రెడిట్, డెబిట్ కార్డులను ఓ పర్సులు పెట్టి హ్యాండ్ బ్యాగులో వేసింది. దర్శనం అనంతరం బ్యాగులో పర్సు చూడగా పకనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## అనారోగ్యంతో వ్యక్తి మృతి

సనత్‌నగర్: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..మోతీనగర్ స్నేహపురికాలనీ కమాన్ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా పాకెట్‌లో లభ్యమైన పుస్తకంలోని ఫోన్ నెంబర్ ఆధారంగా ఆచూకీ కనుగొన్నారు. మృతి చెందిన వ్యక్తి షేక్ మహబూబ్‌పాషా చిన్నా (45) అని, నెల్లూరు జిల్లా నుంచి వలస వచ్చి తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నట్లుగా గుర్తించారు.

# మార్కెట్ పవర్ ప్లాంట్‌ను మూసేయొద్దు

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్



మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబుకు వినతి పత్రం అందజేస్తున్న టీఎన్ శ్రీనివాస్

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు పవర్ ప్లాంట్‌ను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎస్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తన అనుచరులతో కలిసి మార్కెట్ యార్డు ఆవరణలో ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రస్తుత వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ ఆనంద్ బాబు, సెక్రటరీ వెంకన్నలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ... తన హయాంలో మార్కెట్ యార్డులో ప్రతిష్టాత్మక పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. చెత్త ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే ఈ ప్లాంట్ ద్వారా మార్కెట్‌లో విద్యుత్ బిల్లులు ఎంతగానో ఆదా అయిందన్నారు. అదే సమయంలో నిత్యం వందలాది కిలోల మేర పేరుకుపోయే కూరగాయల వ్యర్థాలను డంపింగ్ చేయాల్సిన వ్యయం కూడా తగ్గిందన్నారు. ఏకంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్శించిన ఈ ప్లాంటు నెల రోజుల వినియోగంలో లేకుండా పోవడం తనను కలిచివేసిందన్నారు. ప్రతిష్టాత్మక ప్లాంటు వెంటనే వినియోగంలోకి తేవాలని మార్కెటింగ్ అధికారులు, ప్రస్తుత మార్కెట్ కమిటీని కోరామన్నారు. ఇదిలా ఉండగా, ప్లాంట్ ఆధునీకికరణ పనుల్లో భాగంగానే తాత్కాలికంగా ప్లాంట్‌ను వినియోగించడం లేదని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు తెలిపారు. వీలైనంత త్వరలో ఆధునికీకరణ పనులు పూర్తి చేసి, ప్లాంట్‌ను మరింత సమర్థవంతంగా పనిచేసేలా చూస్తామని ఆయన అన్నారు. తద్వారా మార్కెట్ యార్డు రెవెన్యూ కూడా పెంచుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

## ప్రకాశం పంతులు వర్ధంతికి మంత్రి పొన్నంకు ఆహ్వానం



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానిస్తున్న ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ ప్రతినిధులు

లాలాపేట: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమానికి రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం ప్రకాశం అధ్యయన సంస్థ ప్రతినిధి బృందం ఆహ్వానించింది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు ప్రభుత్వ పరంగా చేయించాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 9గంటలకు అసెంబ్లీ ఎదురుగా ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమాన్ని తలపెట్టినట్లు నిర్వాహకులు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో ప్రకాశం అధ్యయన సంస్థ అధ్యక్షుడు పి.మోహన్‌రావు, కార్యదర్శి దేశాయ్, గిడుగు రుద్రరాజు తదితరులు ఉన్నారు.

## సంగం జగదీశ్వర్‌కు ప్రతిభా పురస్కారం



చిక్కా దేవదాసు ప్రతిభా పురస్కారం అందుకుంటున్న సంగం జగదీశ్వర్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త, రాష్ట్రపతి అవార్డు గ్రహీత సంగం జగదీశ్వర్‌కు డాక్టర్ చిక్కా దేవదాసు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాన్ని అందించారు. పద్మశాలి ఇంజినీర్ విభాగం జాతీయ కల్చరల్ అడ్వైజర్‌గా సేవలందిస్తున్న జగదీశ్వర్‌కు ఈ పురస్కారం లభించింది. త్యాగరాయ గానసభలో కళా నిలయం సాంస్కృతిక సంస్థ, ఓంకార సత్సంగం ఆధ్యాత్మిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పోలీసు ఉన్నతాధికారి సుంకర సత్యనారాయణ, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, పర్యావరణవేత్త మిట్టపల్లి సురేష్ గుప్త, కవి చిక్కా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి



రాహుల్ గాంధీకి రాసిన బహిరంగ లేఖను విడుదల చేస్తున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: అసైన్డ్ భూములకు వెంటనే యాజమాన్య హక్కులు కల్పించాలని దక్షిణాది జేఏసీ చైర్మెన్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీకి రాసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు వరంగల్ రైతు డిక్లరేషన్‌లో పోడు రైతులకు, అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానిపై ఎలాంటి ప్రకటన చేయలేదని మండిపడ్డారు. ఈ విషయమై ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకోలేదని అన్నారు.

◆ ఇందిరమ్మ రాజ్యం తీసుకొస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇచ్చిన దాదాపు 24లక్షల ఎకరాల భూమలకు యాజమాన్య హక్కులు కల్పించలేకపోతున్నారని విమర్శించారు. దుబ్బాక నియోజకవర్గంలో దాదాపు 100 ఎకరాల అసైన్డ్ భూములను బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు తన భార్య, కూతురు పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారని బాధిత ప్రజలు ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేసినా దానిపై సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అసైన్డ్ భూములకు వాస్తవ యాజమానులకు హక్కులు కల్పించి దాదాపు కోటి మంది రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో 57 ఎంబీఎస్సీ కులాల రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వెంకన్న తదితరులు ఉన్నారు.

# అన్ని వేళల్లో అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా అన్ని వేళల్లో ముందుంటానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో సోమవారం 11 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులతో పాటు 18 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక సమస్యల కారణంగా అనేక మంది మెరుగైన వైద్యం పొందలేకపోతున్నారని, అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. అత్యవసర వైద్యం అవసరమైన వారికి కూడా ఎల్‌ఓసీల ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్, బీఆర్‌ఎస్ నేతలు శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, ఆకుల హరికృష్ణ, వెంకటేషన్‌రాజు, శ్రీహరి, అశోక్‌యాదవ్, కిషోర్, కూతురు నర్సింహ, లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, ఆరీఫ్, బలరాం, ఉత్తమ్‌కుమార్‌సింగ్, హరిసింగ్ పాల్గొన్నారు.

## హిందూ ధర్మం గొప్పతనం నలుదిశలా చాటాలి



సనత్‌నగర్: హిందూ ధర్మం గొప్పతనాన్ని నలుదిశాలా చాటి చెప్పాలని లవకుశ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ చైర్మన్, మధుర, అయోధ్య ఉత్తరాధికారి మహంత్ మహేందర్ దాస్ మహరాజ్‌జీ పిలుపునిచ్చారు. సనాతన ధర్మం పరిరక్షణలో భాగంగా సోమవారం సాయంత్రం సనత్‌నగర్‌లో ఆయన పర్యటించి మాట్లాడారు. సనాతన ధర్మం పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరం ముందుకు సాగాలన్నారు. సనాతన ధర్మం అంటే ఒక నిర్దిష్టమైన మతానికి మాత్రమే పరిమితం కాదని, ఆధ్యాత్మిక, సామాజిక బాధ్యతలను సూచిస్తుందన్నారు. భారతదేశం జగద్గురువు అని, ఆ పేరును నిలబెట్టేలా అందరం కలిసి కట్టుగా ముందుకు సాగాలన్నారు. చెడు మార్గాన్ని అనుసరించకుండా సన్మార్గంలో నడిపించగలిగే శక్తి ఒక్క ఆధ్యాత్మికతకే ఉందన్నారు. లవకుశ జన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఉటుకూరు మణిదీప్ మాట్లాడుతూ.. అయోధ్య శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అనుబంధంగా పనిచేస్తున్న లవకుశ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్ తరుపున తెలంగాణలో విస్తృతంగా ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను చేపడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు పాటు పడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే మహంత్ మహేందర్‌దాస్ మహరాజ్‌జీ తెలంగాణ ప్రాంతంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారన్నారు. కాగా బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ శ్రీరామజన్మభూమితీర్థ క్షేత్ర ట్రస్ట్ కార్యకలాపాలకు రూ.50 వేలు విరాళం అందజేశారు.

# ఎల్‌ఆర్‌ఎస్‌కు మరో చాన్స్

- ఈనెల 31 వరకు గడువు పెంపు
- ఆదాయం రాబట్టేందుకు చర్యలు
- జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ అప్రమత్తం

సికింద్రాబాద్: ఆమోదం పొందిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల నుంచి ఫీజు రాబట్టి సర్టిఫికెట్లు జారీ చేసే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం మరోమారు గడువు పెంచింది.ఈ నేపథ్యంలో దరఖాస్తు దారులకు మరోమారు సమాచారం అందించి ఆదాయం రాబట్టుకునేందుకు జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం అధికారులు అప్రమత్తం అయ్యారు. జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్ల పరిధిలో ఆమోదం పొందిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల నుంచి ఆశించిన స్పందన కానరాలేదు. అందిన దరఖాస్తుల పరిశీలనలో అధికారులు నిర్లక్ష్యం వహించగా, ఆమోదం పొందిన దరఖాస్తు దారులు ఫీజు చెల్లించడానికి ముందుకు రాలేదు.

**కేవలం 145మంది మాత్రమే ఫీజు చెల్లించారు..**

◆ జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్ల పరిధిలో 4795 దరఖాస్తులు ఉండగా అందులో ఫీజు చెల్లించేందుకు 1401 దరఖాస్తులు ఆమోదం పొందినట్టు అధికారులు గతంలోనే ప్రకటించారు. ఇప్పటికే రెండు మార్లు ఫీజు చెల్లింపు గడువును పొడిగించి 25 శాతం రాయితీ ఇచ్చినా కేవలం 145 మంది మాత్రమే ఫీజు చెల్లించడం గమనార్హం.

**సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు...**

◆ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు దారుల సమస్యలు పరిష్కరించి వారి సందేహాలు నివృత్తి చేసేందుకు సర్కిల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినా దరఖాస్తు దారుల నుంచి నామమాత్రపు స్పందన మాత్రమే లభించింది. జీహెచ్‌ఎంసీ ఉత్తర మండలం పరిధిలోని ఐదు సర్కిల్ కార్యాలయాల పరిధిలో మొత్తంగా 1401 దరఖాస్తులను ఆమోదించిన అధికారులు కనీసం 1వెయ్యి దరఖాస్తుల నుంచి ఫీజు రాబట్టవచ్చునని అంచనా వేశారు. వారందరికీ ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలంటూ ఫోన్ కాల్ ద్వారా, మెస్సేజ్ ద్వారా సమాచారం అందించారు. అయినప్పటికీ కేవలం రూ. 2,51,64,675 ఆదాయం మాత్రమే లభించింది.

◆ మరో రెండు వారాల గడువు ఉండటంతో ఆలోపు ఎక్కువ మంది దరఖాస్తుదారులను సంప్రదించి ఫీజు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఐదు సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లకు జోనల్ కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు పంపించారు.



సికింద్రాబాద్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ (ఫైల్)